# పరమౌషధం

రైలు ప్రమాదాలు అప్పుడప్పుడూ, ఎక్కడో ఎప్పుడో కాక ఎక్కడో ఒకచోట ఎప్పుడూ జరుగుతూ వచ్చి జనం తంబ తంబలుగా చచ్చిపోతుంటే ప్రభుత్వానికి, ప్రజలకు సమాధానం చెప్పుకోడం చచ్చే పనైపోయింది.

ప్రభుత్వం "కమిటీ వేశాం" అని తప్పించుకోబోతే, "వేస్తే చచ్చిపోయిన వాళ్ళు బతికొస్తారా?" అని ప్రజలు కోప్పడ్డారు.

"కమిటీ వేస్తే కదా ప్రమాదం ఎందుకు జరిగిందో తెలుస్తుంది? ఎందుకు జరిగిందో తెలిస్తే ఇక ముందు ప్రమాదం జరగకుండా జాగ్రత్త పడే అవకాశం ఉంటుంది" అని ప్రభుత్వం నచ్చచెప్పింది.

అయితే ప్రమాదాలు జరిగినంత వేగంగా కమిటీల నియామకం జరగటం కష్టం. ఎందుకంటే బోలెడంత మంది తలో చెయ్యీ వేసి ప్రమాదాలు జరిగేటట్టు చూస్తే కేవలం ఒకే ఒక రైల్వే మంత్రి తనకున్న రెండే రెండు చేతుల్తో కమిటీలు వేస్తూ పోవాలి. పేరుకి రెండు చేతులున్నా సంతకం పెట్టి కమిటీని నియమించే చెయ్యి ఒకటే. అందుకని ప్రమాదాల వేగాన్ని రైళ్ళు, వాటి సంఖ్యని కమిటీల సంఖ్య అందుకోలేకపోయాయి. దాని వల్ల మంత్రిగారి తలకాయకి నొప్పి వచ్చింది. లేకపోతే కిరీటం వస్తుందా? మొదట్లో మంత్రుల కొందరు "నైతిక బాధ్యత మాదే" అంటూ ప్రమాదం జరిగిన ఒకోసారి రాజీనామా లిచ్చారు. "ఇటువంటి విషయాల్లో ఏదో విధంగా మనస్సుతో రాజీ పడి ప్రజలకి నామాలు పెట్టాలి. అంతేగాని రాజీ, నామాలు ఇవ్వరాదు" అని ప్రధానమంత్రిగారు వాళ్ళని కేకలేశారు చికాకుపడి.

ఆ పైన ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలకు తామేదో తగిన చర్య తీసుకొంటున్నట్లు కనిపించటం ఎల్లాగా అని ఆలోచించి రైల్వే సేఫ్టీకి ఒక పర్మనెంట్ శాఖని సృష్టించింది. దేశాన్ని నాలుగైదు భాగాలుగా విభజించి ఒక్కో భాగానికి ఒకో కమిషనర్‌ని వేసి, ఆ భాగంలో జరిగిన ప్రమాదాల్ని దర్యాప్తు చేసి, నివేదికలు సమర్పించవలసిన బాధ్యత అప్పగించింది.

"దొంగాడికి తాళం చెవులిచ్చారు మీరు" అని ప్రతిపక్షాలు విమర్శించాయి.

"కాదు. మేము దొంగ వాకిట పక్కవేశాం" అంది ప్రభుత్వం.

"ఈ కమిటీలు నిష్పక్షపాతంగా నివేదికలు సమర్పిస్తాయా? రైలు ప్రమాదాలకి రైల్వే వారు ఏ విధంగానూ బాధ్యులు కారన్న నివేదికలు రైల్వే కమిషనర్లు రాయరా? ఎందుకీ నటన?'' అని హేళన చేశాయి పత్రికలు.

"ఆగండయితే, ఆ శాఖని రైల్వే మంత్రి కింద కాక విమానాల మంత్రి అజమాయిషీ కింద పెడుతున్నాం. దీని వల్ల ఇక అన్ని నివేదికలు పక్షపాత రహితంగా ఉండక తప్పదు'' అంది. నిష్పక్షపాతంగా కనిపిస్తే చాలు పక్షపాతరహితంగా ఉన్నా లేకపోయినా అన్న సూత్రాన్ని అర్థం చేసుకున్న ప్రభుత్వం.

ఆ విధంగా ఒకానొక భాగానికి వినాయకరావు కమీషనర్ ఆఫ్ రైల్వేస్ సేఫ్టీగా నియమితు డయ్యాడు. అతను కదిలితే కడుపులో చల్ల బుళక్ బుళక్ అని శబ్దం చేసేది. అందుకని అతనికికి కడుపులో చల్ల కదలటం ఇష్టం ఉండేది కాదు. అతనికి మొదట్లో నివేదికలు తయారు చెయ్యటానికి చాలా శ్రమగా ఉండేది. ఒక నివేదిక తయారవకుండానే మరో ప్రమాదం జరుగుతూండేది. కానీ క్రమేపీ అతను అమలు జరిపిన పద్ధతి వల్ల ఒక నివేదిక తయారైన కొద్ది రోజులకి గాని మరో ప్రమాదం జరిగేది కాదు. అందుకని ప్రమాదాలు జరగటం తగ్గిందని మనం అనుకోరాదు. అతను ప్రమాదాలు జరిగినంత వేగంగానూ నివేదికలు తయారు చేయటం మొదలు పెట్టాడన్నమాట. అవి ఎంత వేగంగా ఎలా తయారు చెయ్యటమో అన్యాపదేశంగా చెప్పిన స్త్రీ అతని మాతృమూర్తి సుబ్బమ్మ.

వినాయకరావుకి పేరు వల్ల తిండంటే ఇష్టం ఏర్పడిందో, తిండివల్ల సార్థక నామధేయు డయ్యాడో చెప్పటం కష్టం. కాని అతనికి తిండి అంటే విపరీతమైన ఇష్టం అని పోల్చుకోవటం చాలా సులభం. అతని పొట్టని చూస్తే చాలు. అతను బొడ్డు దగ్గర గోక్కోవాలంటే చెయ్యి పూర్తిగా సాచవలసి వస్తుంది. అయితే తిండి మీద ప్రేమ వల్ల అతనికి అజీర్తి, విరోచనాలు మొదలైన ఈతి బాధలు అడపా దడపా కలుగుతూ వచ్చాయి చిన్నప్పటి నుంచి.

వినాయకరావు తల్లి తల్లడిల్లి ఓ వైద్యశిఖామణికి చూపించింది. అతను ఒక్క వాక్యంలో చెప్పాడు "అమ్మా! ఇతనికి లంఖణం పరమౌషధం'' అని.

అప్పట్నుంచి వినాయకరావుకి ఏ విధమైన అనారోగ్యం కలిగినా ఆమె అతని లంఖణం పడుకోబెట్టేది. అనారోగ్యం తిండి ఎక్కువై వచ్చినదైతే టక్కున సర్దుకునేది. కాక మలేరియా, టైఫాయిడ్ లాంటివి వస్తే మందు కూడా వడాల్సి వచ్చేది. మందు వేశాం కదా అని లంఖణం మానలేం కదా! అందువల్ల అనారోగ్యం ఏదైనా, ఎలా కలిగినా, లంఖణం ఆవశ్యకత ఆవిడ అర్థం చేసుకొంది. దాని మీద గౌరవం పెంచుకుంటూ వచ్చింది.

వినాయకరావు కమిషనరై నివేదికలు త్వరగా తయారుచేయటం చేతకాక తల పట్టు కూర్చున్న ఒక రోజున, "వీణ్ణి లంఖణం పెట్టు. జబ్బు అదే తగ్గుతుంది'' అని కోడలితో మనవడి గురించి ఆజ్ఞ జారీ చేస్తున్న తల్లి మాటలు వినాయకరావు చెవిన పడ్డాయి. డాక్టర్ని పిలవాలి. అతను పరీక్ష చేసి రోగ నిర్ణయం చేసి మందు చెప్పాలి అని కోడలి అభిప్రాయం.

"అనారోగ్యానికి కారణం ఏమిటో తెలియకుండా ఎలాగండీ అత్తగారూ?" అంది వినాయకరావు భార్య.

"ప్రతిదానికీ వంద కారణాలుండవచ్చు. కాని పరిష్కారం ఒక్కటే. గోపికలు వెయ్యి మందైనా గోపాలు ఒక్కడే. రోగాలు ఎన్నైనా మందు ఒక్కటే పిచ్చిదానా!" అంది ఆవిడ.

వినాయకరావుకి జ్ఞానోదయం అయింది. రైలు ప్రమాదాలకి వంద కారణాలుండవచ్చు. కాని పట్టాలు సరిగా ఉన్నాయో లేవో సరి చూసుకునే పర్మనెంట్ వే ఇన్‌స్పెక్టర్ అప్రమత్తుడై ఉంటే ప్రమాదాలు ఎలా జరుగుతాయి? చెరువు కట్ట తెగి దాని దిగువ నున్న బ్రిడ్జి కొట్టుకు పోయిందనుకొన్నా, బ్రిడ్జి కొట్టుకుపోయినప్పుడు పట్టాలు వేలాడతాయి కదా! అవి వేలాడుతున్నాయని గమనిస్తే ప్రమాదాన్ని ఆపవచ్చు కదా! అంటే ఇరవై నాలుగు గంటలూ వేయి కళ్ళతో పట్టాల్ని ప్రతి మీటరు కనిపెట్టి చూస్తూ ఉండాలి. పర్మనెంట్ వే ఇన్‌స్పెక్టర్లు అలా చూస్తూ ఉంటే ప్రమాదాలు జరగవు. లేకపోతే జరుగుతాయి. అంటే ప్రమాదాలు జరిగాయి అంటే అతగాడి అజాగ్రత్తే కారణం!

వినాయకరావు ఈ విధంగా తాత్కాలికంగా ఆలోచించి నిర్ణయానికి వచ్చాక నివేదికలు చక చకా తయారు చేయగలిగాడు. ఆ విధంగా పాత ప్రమాదానికి నివేదిక తయారు చేసి కొత్త ప్రమాదం జరిగే వరకూ తీరుబడిగా కూర్చొ గలుగుతున్నాడు.

అటువంటి రోజుల్లో బోసు ఇలాకాలో ప్రమాదం జరిగింది. బోసు డివిజనల్ ఇంజనీర్. అతగాడికి అమ్మా, నాన్న పెట్టిన పేరు వసుదేవుడు. అతను పెరిగినప్పుడు వాళ్ళు బెంగాల్లో ఉన్నారు. అందుకని అతని పేరు బోస్‌దేబ్‌గా మారింది. మళ్ళీ వాళ్ళు ఆంధ్రా వచ్చినప్పుడు కొందరు దేబ్‌ని దేబిగా మార్చి వేళాకోళానికి దిగితే దాన్ని కత్తిరించి 'బోసు" చేసుకొన్నాడు. అతనికి తెలుగు వేడి రక్తం, బెంగాలీ ఉడుకు స్నేహాలు ఉండటం వల్ల నిజాన్ని నిర్భయంగా చెప్పటం, నమ్మిన దాన్ని గురించి ఘోరంగా పోట్లాట్టం అబ్బాయి. అందుకని అతన్ని అందరూ "ఇతను నిజంగా సుభాస్ చంద్రబోస్ లాంటివాడు" అని, 'బోసుబాబు' అని పిలవటం మొదలు పెట్టారు.

అతను డివిజనల్ ఇంజనీర్‌గా ఛార్జి తీసుకొన్నాక అతను పర్మనెంటుగా వే ఇన్‌స్పెక్టర్ల చేత పట్టాల మీద పర్మనెంట్‌గా కాపురాలు పెట్టించాడు.

అప్పుడు వారి భార్యలు "మేమూ, మా శ్రీవార్లూ జీవితాంతం సమాంతరంగా పక్కపక్కనే ఉంటామే కాని, కలవం" అనడం మొదలుపెట్టారు.

ఆ రోజుల్లో, 'అతకని బతుకులు - కలవని పట్టాలు,' 'ఆతకని పట్టాలు - కలవని బతుకులు,' 'పట్టాల బతుకులు,' 'బతుకుల పట్టాలు' మొదలైన నవలలు రైల్వే సిబ్బంది జీవితాలకి అద్దం పడుతూ వెలువడ్డాయి.

అటువంటి వసుదేవుడి డివిజన్‌లో రైలు ప్రమాదం జరిగి ప్రయాణీకులు పప్పైపోయారు. వినాయకరావు ఎంక్వైరీకి భారీకాయంతో కష్టపడి తరలి వచ్చాడు.

"బోసుబాబూ! మిమ్మల్ని కమీషనర్‌గారు కేకేసుకు రమ్మన్నారండీ!" అని కబురందగానే

వసుదేవుడు కమీషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ ముందు వచ్చి నిలబడి, "ఈ ప్రమాదం ఎలా జరిగిందో తెలియటం లేదు! నేనూ, నా సిబ్బందీ అనుక్షణం పట్టాల్ని తనికీ చేస్తూనే ఉన్నాం. వాటిలో ఏ దోషం లేదు. ప్రమాదం జరగడానికి ముందు రోజున మా ఇన్‌స్పెక్టర్, నేనూ తనిఖీ చేశాం, నేను తనిఖీ చేసిన వచ్చిన ఆరు గంటలకి ప్రమాదం జరిగింది. పట్టాలు తనిఖీ చేసినప్పుడు సరిగానే ఉన్నాయి. మరి ప్రమాదం ఎలా జరిగిందో? పట్టాల పరిస్థితి రోజుల కొద్దీ నిర్లక్ష్యం చేస్తే తప్ప పాడవదు. అటువంటప్పుడు ఆరు గంటల్లో ఎలా పాడవుతుంది?" అని ఉద్రేకంగా చెప్పుకుపోయాడు.

వినాయకరావు గంభీరంగా కనుబొమ్మలెత్తి, "నేను సి.ఆర్.ఎస్.ని. మీరు నాకు నా ఎంక్వైరీలో సహాయ పడాల్సిన వ్యక్తి మాత్రమే. నేను మిమ్మల్నింకా ప్రశ్న లడగలేదు. మీరు ఉపన్యాసం ఇస్తున్నారు. మీకు పాలిటిక్స్‌తో సంబంధం ఉందా?" అని అడిగాడు.

వసుదేవుడు సర్దుకున్నాడు. పాలిటిక్స్ అన్న మాట విని కొద్దిగా భయపడి "లేదు" అన్నాడు. ఆపైన వసుదేవుడిలో మార్పుకి వినాయకరావు సంతోషించాడు.

"నా అనుభవం వల్ల ఇటువంటి ప్రమాదాలు పి.డబ్ల్యు.ఐ.ల అజాగ్రత్త వల్ల మాత్రమే జరుగుతున్నాయని గుర్తించాను" అన్నాడు సి.ఆర్.ఎస్. వినాయకరావు ఉపోద్ఘాతంగా.

"అవవచ్చు సాధారణంగా. కాని ఇది ఎంత మాత్రమూ కాదు" అని వసుదేవుడు కచ్చితంగా చెప్పాడు.

"మీరు ప్రమాదం జరిగిన పట్టాల భాగాన్ని చూస్తే పి.డబ్ల్యు.ఐ. చుట్టాలా?"

"కాదు."

"కులం వాళ్ళా?"

"కాదు."

"ఊరు వాళ్ళా?"

"కాదు. ఒకే దేశానికి చెందిన వాళ్ళం" అన్నాడు కోపంగా వసుదేవుడు వినాయకరావు ఏం మనసులో పెట్టుకొని అడుగుతున్నాడో పోల్చుకొని.

వినాయకరావు కొత్త ఎత్తు ఎత్తాడు. "ఈ ప్రమాదానికి పి.డబ్ల్యు.ఐ. కారకుడని తేలితే అతనికి మహా అయితే మూడ్రోజుల సస్పెన్షన్ లేక పక్క డివిజన్‌కి ట్రాన్స్‌ఫర్ అవుతుంది. జనం కొద్ది రోజుల్లో మరిచిపోతారు. అతని పిల్లల చదువు పాడవకుండా ఒకటి రెండు నెలల తరువాత మళ్ళీ ఇక్కడే పోస్ట్ చేయించుకోవచ్చు. రేప్ కేసుల్లో సబ్ ఇన్‌స్పెక్టర్ల చేయి ఉందని తేలితే అంతే కదా అవుతుంది! అదే ప్రైం మినిస్టర్ల విషయం తీసుకోండి! సెక్స్ స్కాండల్ చాలు. బలవంతం అక్కర్లేదు. రాజకీయ జీవితం గోవిందా! ఎందుకు చెప్తున్నానంటే బాధ్యత పెద్దవాళ్లదని తేలిన కొద్దీ చెల్లించాల్సిన జరిమానా ఎక్కువ అవుతుంది. ప్రమాదం లాంటి చిన్న విషయానికి పూర్వం మీ రైల్వే మంత్రులు కొందరు రాజీనామా చేసి ప్రాయశ్చిత్తం చేసుకున్నారు. అదే చిన్న వాడికైతే చిన్న శిక్ష. దాసుడి తప్పు దండంతో సరి. అందుకుని ఈ ప్రమాదం

పి.డబ్ల్యు.ఐ. ది అని మనం ఇద్దరం కలిసి నిర్ణయిస్తామనుకోండి. మనకే గొడవా ఉండదు. అతనికి పెద్ద శిక్షా ఉండదు. నా మాట వినండి" అని నచ్చ చెప్పబోయాడు వినాయకరావు.

బోసుబాబుకి ఆ పరిష్కారం నచ్చలేదు. "నా పి.డబ్ల్యు.ఐ.ది ఏమీ తప్పులేదు. దానికి నేను సాక్ష్యం" అన్నాడు మొండిగా.

వినాయకరావుకి విసుగు కలిగింది.

"ఏమిటంటారు?"

"పట్టాలు సరిగానే ఉన్నాయి అంటాను."

వినాయకరావుకి చికాకేసింది.

"ఎవరు చూశారు?"

"నేనే చూశాను. బాధ్యతగల డివిజనల్ ఇంజనీర్ని".

వినాయకరావుకి కోపం వచ్చింది. లేచి కూర్చున్నాడు. కడుపులో చల్ల బుళక్ అంది. పైనున్న పచ్చని లాగు కొద్దిగా జారింది. "అయితే పి.డబ్ల్యు.ఐ.ది కాదు, నీ పని పడ్తా!" అని సింహంలా గర్జించాడు.

"నేను నోట్ చేసుకొన్న విషయాలు మూడు. ఎన్నో రోజులు అశ్రద్ధ చేస్తే కాని పట్టాల పరిస్థితి ప్రమాదం జరిగేంతగా పాడవదు. ఇది మొదటిది. భయోత్పాదకులెవరూ ఫిష్ ప్లేట్లూ, గ్రూ తియ్యలేదు. ఇది రెండవది. ప్రమాదానికి ముందు రోజు మీ పి.డబ్ల్యు.ఐ., కొద్ది గంటల ముందు మీరు పట్టాల్ని తనిఖీ చేసి అవి సరిగా ఉన్నాయంటూ సర్టిఫై చేశారు. ఇది మూడవది. అవునా?"

"అవును" వసుదేవుడు ఏకీభవించాడు.

"మీరిద్దరూ డ్యూటీ సరిగా చెయ్యలేదని, పట్టాలు చాలా కాలంగా పాడవుతూ వచ్చినా అశ్రద్ధ వల్ల మీరు గుర్తించలేదని నా అభిప్రాయం. ఈ ఇంక్వైరీ ముగిసే సరికి నా అభిప్రాయం నిర్ణయంగా మారిపోతుంది."

"మీ అభిప్రాయాన్ని సమర్థించు కోగలగాలి కదా!" బోసుబాబు తొడ చరిచాడు.

వినాయకరావు చిన్న నవ్వు నవ్వి, "అలాగే సమర్థిస్తాను. మీరు, ఇంజన్ డ్రైవర్లు, ఇంజన్‌లోనే దాన్ని నడుపుతూనే నిద్రపోతూ ఉంటారన్న విషయం విన్నారా?" అనడిగాడు.

"విన్నాను" అని ఒప్పుకున్నాడు వసుదేవుడు. అందులో అతనికి వినాయకరావు పన్నాగం అర్థం కాలేదు.

"మీరు తనిఖీ చేసేటప్పుడు ఎలా ప్రయాణిస్తారు?"

"ట్రాలీ మీద కాని, రైల్లో కాని, గార్డు పెట్టెలోను, ఇంజన్‌లోను ప్రయాణం చేస్తాం ఇన్‌స్పెక్షన్ కోసం రైల్లో ప్రయాణం చేసినప్పుడు".

"అయితే మీకు ఇంజన్‌లో ప్రయాణం అనుభవం ఉంది కదా! అది సుఖమా? ట్రాలీ మీద ప్రయాణం సుఖమా?"

"రెండూ కావు."

"పోనీ ఏది ఎక్కువ సుఖం?"

"ట్రాలీ మీద ప్రయాణం కొద్దిగా నయం, ఇంజన్‌లో ప్రయాణం కంటే" వసుదేవుడు గోతిలోకి తిన్నగా నడవటం వినాయకరావుకి సంతోషం కలిగించింది.

"మీరు మనుష్యమాత్రులేనా?"

"అవును పేరులో మాత్రమే దేవుడిని".

"ఇంజన్ డ్రైవరూ మనుష్యమాత్రుడే! అంటే, అతను చెయ్యగల పనులు మీరూ చెయ్యగలరు. అతను ఇంజన్‌లో చెయ్యగలపని... డ్యూటీలో నిద్ర పోవటం.... అంతకంటే కొద్దిగా సుఖతరమైన ట్రాలీ ప్రయాణంలో మీరు చెయ్యగలరు. ప్రమాదం జరిగిన పట్టాల భాగం మీద ట్రాలీ వెళ్తున్నప్పుడు మీరు నిద్రపోయి ఉంటారని ఆరోపిస్తున్నాను. మీ ట్రాలీ లోడు, స్పీడు తక్కువ కనుక ప్రమాదం జరగలేదు. లేకపోతే మీ ట్రాలీయే తిరగబడి ఉండేది రైలు కంటే ముందు. ఇదే నా ఎంక్వైరీ రిపోర్టు సారాంశం".

వినాయకరావు పూర్తి చేసి తృప్తిగా నవ్వాడు పి.డబ్ల్యు.ఐ. కాకపోతే డి.ఇ. ఎవరైతే నేం? కారణం ఇంప్రాపర్ ఇన్‌స్పెక్షన్. ప్రమాదం పట్టాలు సరిగా లేక జరిగింది. నివేదికలో మార్పుండదు.

వసుదేవ్‌కి జరుగుతున్నది అర్థమయ్యే సరికి పొగరు స్థానంలో భయం చేరుకొంది. అతని పూర్వీకుడు గాడిద కాళ్ళు పట్టుకున్నా లేకపోయినా ఇతనికి వినాయకరావు కాళ్ళు పట్టుకోవాల్సిన అవసరం అర్థమైంది. పట్టుకున్నాడు.

వినాయకరావు ఎంక్వైరీ జరుపుతూ అక్కడున్నన్ని రోజులూ అతనికి విందు భోజనా లేర్పాటు చేశాడు. ఆకలితో ఉన్నవాడు ఏ పాపం అయినా చేస్తాడు? అలాగే కడుపు నిండా తిన్నవాడు పరమ శాంతుడు, ప్రసన్నుడు అవుతాడు. వినాయకరావు పి.డబ్ల్యు.ఐ. అజాగ్రత్త వల్ల ప్రమాదం జరిగినట్టు నివేదిక తయారు చేయటానికి కావలసిన సమాచారం సేకరించి ఇంటికి జేరుకున్నాడు.

తిన్న విందులు వాటి ప్రభావం చూపించాయి.

"లంఖణం పరమౌషధం. వీణ్ణి లంఖణం పడుకోబెట్టు" అని ఆజ్ఞ జారీ చేసింది అతని తల్లి సుబ్బమ్మ కోడలికి.

*- ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, '89*

★